
**ఇన్‌ఛార్జీలతో ఇంకెన్నాళ్లు..?** 2





**అమ్మాయి మోసం చేసిందని.. యువకుడి ఆత్మహత్య** 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

## సర్పంచ్‌తో పాటు కార్యదర్శికి చెక్‌పవర్ ఇవ్వాలి



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** సర్పంచ్‌తో పాటు జీపీ కార్యదర్శులకు సైతం జాయింట్ చెక్‌పవర్ ఇవ్వాలని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముస్కు సాయరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉప సర్పంచులకు చెక్ పవర్ ఉండటంతో పలు జీపీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయన్నారు. కొన్నిచోట్ల వ్యక్తిగత కారణాలు, స్థానిక సమస్యల కారణంగా చెక్కులపై సంతకాలు చేయడం లేదని పేర్కొన్నారు.



# కరెంట్ 'కట్'కట..

రైతులు కష్టపడి సాగు చేసిన పంటలకు నీరు అందడం లేదు. ఓ వైపు వరుణుడు ముఖం చాటేశాడు. ఎండలు దంచికొడుతున్నాయి. పంటలకు ప్రస్తుతం నీరు ఎంతో అవసరం. బోరుబావుల ఆధారంగా పొలాలకు నీరు పెడదామంటే కరెంట్ ఉండటం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి





- ఎండిపోతున్న పంటలు
- విద్యుత్ కోసం రోడ్డెక్కుతున్న వైనం
- విద్యుత్ అధికారులపై ఆగ్రహం

కామారెడ్డి జిల్లాలో వ్యవసాయ పనులు దాదాపు ముగిశాయి. ప్రస్తుతం పంట పొట్ట, పిలక దశలో ఉంది. ఈ సమయంలో పంటలకు సరిపడా నీళ్లు అవసరం ఉంది. అయితే నీళ్లు పారితే తప్ప పంట బతికే అవకాశం లేని సమయంలో త్రీ ఫేస్ కరెంట్ అన్నదాతలను ఆగం చేస్తోంది.

### ఎండిపోతున్న పంటలు..

జిల్లాలో ప్రస్తుతం వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటలు కీలకమైన ఎదుగుదల దశలో ఉన్నాయి. ఈ సమయంలో సకాలంలో నీరు అందకపోతే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. గత 10 రోజులుగా మూడు ఫేజుల కరెంట్ కేవలం 5 నుంచి 7 గంటలు మాత్రమే ఇస్తున్నారని, అది కూడా తక్కువ వోల్టేజీతో వస్తుండటంతో బోర్లు నీరు పోయడం లేదని రైతులు వాపోతున్నారు. రోజూ రాత్రి వేళల్లో కరెంట్ ఇస్తుండటంతో పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోందని అంటున్నారు. పాము కాటు, తేలుకాటు భయంతో రాత్రి మోటార్లు ఆన్ చేయలేకపోతున్నామని, దీంతో రూ.వేలల్లో ఖర్చుపెట్టి వేసిన పంట ఎండిపోతుందని కన్నీరు పెడుతున్నారు. బీబీపేట, రాజంపేట్, సదాశివనగర్, గాంధారి, బాన్సువాడ మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని రైతులు చెబుతున్నారు.

### విద్యుత్ అధికారులపై ఆగ్రహం

కరెంట్ కోతలపై రైతులు విద్యుత్ శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య వస్తోందని ఆరోపిస్తున్నారు. లైన్లపై చెట్ల కొమ్మలు పడినా తొలగించడం లేదని అంటున్నారు. వ్యవసాయానికి రోజుకు కనీసం 9 గంటల పాటు పగటిపూట నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

### జిల్లాలో పంటల సాగు వివరాలు..

కామారెడ్డి జిల్లాలో సాగు పూర్తిగా బోరుబావులపై ఆధారపడి ఉంది. జిల్లాలో మొత్తం 5 లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉండగా, ప్రస్తుత వానాకాలంలో పంటల సాగు వివరాలు ఇలా ఉన్నాయి. వరి పంట 3,14,251 ఎకరాలు, సోయాబీన్ 87,736 ఎకరాలు, కంది 48,315 ఎకరాలు, మొక్కజొన్న 47,237 ఎకరాలు, పత్తి 45,864 ఎకరాలు, పెసర 2,198 ఎకరాలు, మినుము 1,851 ఎకరాలు, చెరకు 573 ఎకరాలు సాగవుతున్నాయి. ఇంత భారీ విస్తీర్ణంలో పంటలు సాగవుతున్న తరుణంలో కరెంట్ కోతలు పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సకాలంలో విద్యుత్ సరఫరా చేయకపోతే జిల్లాలో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.



### రోడ్డెక్కుతున్న రైతులు..

విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో రైతులు చివరికి రోడ్డెక్కక తప్పలేదు. బుధవారం పలు మండల కేంద్రాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లను రైతులు ముట్టడించారు. ప్రధాన రహదారులపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బుధవారం పాల్వంచ, లింగంపేట మండలాల్లో రైతన్నలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు 24 గంటల నాణ్యమైన కరెంట్ అన్నారు. ఇప్పుడు 3 గంటలు కూడా సరిగా ఇవ్వడం లేదు. మా పంటలు ఎండిపోతుంటే అధికారులు ఏసీ గదుల్లో కూర్చున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు కష్టాలు తీర్చాలని కోరుతూ.. భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. 18 గంటలు కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. దీంట్లో భాగంగా జిల్లా, మండల స్థాయిల్లో ప్రభుత్వ కార్యక్రమాలు జరగాలన్నారు. హైదరాబాద్ విమోచనంలో కీలకపాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు భారీ స్టాచ్యూ ఏర్పాటు చేయాలన్నారు. నిజాం పాలన, రజాకార్ల దురాగతాలు, ప్రజాపోరాటాలు, ఆపరేషన్ పోలో, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనానికి సంబంధించిన చారిత్రక ఆధారాలను పరిరక్షించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరాన్ని సీపీ సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా అభ్యర్థులకు విలువైన సలహాలు, సూచనలు అందించారు. రీజనింగ్, ఆంగ్లం, గణితం అంశాలలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన పద్ధతుల గురించి మెలకువలు తెలియజేశారు. ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తేనే కొలువు సాధించగల్గుతారని సూచించారు. పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య మాట్లాడుతూ హైదరాబాద్‌లో అందించే కోచింగ్‌కు ఏమాత్రం తక్కువ కాకుండా మరింత మెరుగైన మెటీరియల్‌తో పాటు, నిష్ణాతులైన ఫ్యాకల్టీచే స్థానికంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయించామని చెప్పారు. ప్రీ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ అన్ని విధాలుగా తోడ్పాటును అందించారని జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగార్థులకు భోజన వసతిని సమకూరుస్తూ రెండునెలల పాటు శిక్షణ అందిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, నిపుణులతో అభ్యర్థులకు మెలకువలు నేర్పిస్తున్నట్లు చెప్పారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిషన్ తెలిపారు. బాల్కొండ టౌన్ 11కేవీ విద్యుత్ లైన్ ఫీడర్ బైఫరికేషన్ నేపథ్యంలో బాల్కొండ గ్రామంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

## జిల్లాలో రైస్‌మిల్లుల బంద్.. కారణమేమిటంటే?




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఉమ్మడి జిల్లాలో రైస్‌మిల్లులు బంద్ నిర్వహిస్తున్నాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొన్నాళ్లుగా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ వస్తున్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. 1969 నుంచి ఉన్న నిబంధన ప్రకారం క్వింటాల్‌కు 67.1కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉందని.. కానీ మారిన పరిస్థితుల కారణంగా దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన చట్టం ప్రకారం బియ్యం సరఫరా సాధ్యం కావట్లేదన్నారు. అలాగే రైతుల తెచ్చిన ధాన్యంలో 15శాతం నుంచి 20శాతం వరకు డ్యామేజీ భరించాల్సి వస్తోందన్నారు. 2014 నుంచి నిజామాబాద్ జిల్లా లోని అనేక రైస్‌మిల్లులకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. దీంతో మిల్లుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు ప్రభుత్వం అడుగుతున్న బియ్యం సరఫరా చేయడం కూడా సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయముపై అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించాలని కోరారు. లేనిపక్షంలో బంద్‌ను కంటిన్యూ చేస్తామని స్పష్టం చేశారు.

## బాలల భవిష్యత్తుకు డిజిటల్ వ్యసనాలు శాపం



**అక్షరటుడే, కామారెడ్డి:** నేటి సాంకేతిక యుగంలో బాలల ఉజ్వల భవిష్యత్తుకు డిజిటల్ వ్యసనాలు శాపంగా మారుతున్నాయని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లాలో కమిషన్ బృందం విస్తృతంగా పర్యటించింది. విద్యార్థులు స్మార్ట్ ఫోన్ల మితిమీరిన వాడకం, రీల్స్, సోషల్ మీడియా వ్యామోహంలో పడి విలువైన విద్యా సమయాన్ని, ఏకాగ్రతను కోల్పోవద్దని కొత్తకోట సీతా దయాకర్ సూచించారు. కమిషన్ సభ్యుడు వచన్ కుమార్‌తో కలిసి భిక్కనూర్ మండలం జంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, దోమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, పాల్వంచలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, సదాశివనగర్ మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లను క్షేత్రస్థాయిలో సందర్శించారు. పాఠశాలల్లోని తరగతి గదులు, వంటశాలలు, వసతి గృహాలు, డిజిటల్ ల్యాబ్‌లు, తాగునీటి సౌకర్యాలను నిశితంగా పరిశీలించారు. సాంకేతికతను కేవలం జ్ఞానం సంపాదించుకోవడం కోసం మాత్రమే పరిమితం చేసి పుస్తకాలతో స్నేహం చేయాలని సూచించారు.



## స్పీకర్‌కు బీఆర్ఎస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రవర్తించిన తీరు అత్యంత హేయమైనదని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది మహేష్, డీసీసీ జనరల్ సెక్రెటరీ నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం కామారెడ్డి లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు ప్రతిపక్షంలో ఎలా వ్యవహరించాలో కూడా తెలియడం లేదని విమర్శించారు. శాసనసభ దేవాలయం లాంటిదని, అలాంటి సభకు పెద్ద అయిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బీఆర్ఎస్ నేతలు అమానుషంగా, దురుసుగా మాట్లాడటాన్ని సేవాదళ్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు మెహర్ బాబా గౌడ్, కామారెడ్డి టౌన్ అధ్యక్షుడు సుదర్శన్, రాజంపేట మండల అధ్యక్షుడు వేణు చారి పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** వినాయకచవితి పండుగను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినాయకచవితి ఏర్పాట్లపై ఆమె సమీక్ష నిర్వహించారు. వినాయక మండపాల పరిసరాల్లో నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ విభాగాన్ని ఆదేశించారు. నిమజ్జన మార్గాల్లో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, నిమజ్జన ప్రదేశాల్లో అవసరమైన వసతులు, వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, సీఐ నరహరి, తహశీల్దార్ హిమబిందు పాల్గొన్నారు.






## ఆరోగ్య సూచికల మెరుగుదలే లక్ష్యంగా పనిచేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో ఆరోగ్య సూచికల మెరుగుదలే ప్రధాన లక్ష్యంగా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో వెంకటి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మాతా శిశు ఆరోగ్యం, టీకాలు, క్షయ వ్యాధి నిర్మూలన, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, వ్యాధి నిఘా, స్క్రీనింగ్, చికిత్స, ఫాలోఅప్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ వెనుకబడిన సూచికలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. హైపర్‌టెన్షన్, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులపై విస్తృతంగా స్క్రీనింగ్ నిర్వహించి గుర్తించిన వారికి నిరంతర చికిత్స, ఫాలోఅప్ అందేలా చూడాలని, క్షయ వ్యాధి అనుమానితులను త్వరగా గుర్తించి పరీక్షలు నిర్వహించి సకాలంలో చికిత్స అందించాలని తెలిపారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాల వివరాలను ఆన్‌లైన్‌లో సకాలంలో ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, నివేదికలు వాస్తవ క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలని స్పష్టం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు: ముప్ప గంగారెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలో మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. బుధవారం గాంధీ గంజ్ లోని మార్కెట్ యార్డ్‌లో నూతన రిటైల్ కూరగాయల వ్యాపార మడిగెలను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తుందన్నారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అందులో భాగంగా 40 రిటైల్ మడిగెలను అర్హులకు అందేలా చేశామన్నారు. ఇంకా మిగిలిన వారికి కూడా త్వరలోనే అందేలా చూస్తామన్నారు. మార్కెట్ రోడ్డులో ప్రధానాలు జరుగుతున్నాయనీ గ్రహించి వాహనాలు లోనికి రాకుండా ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చేస్తామన్నారు.

## విద్యుత్ సరఫరాను 18 గంటలకు పెంచాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ కామారెడ్డి జిల్లా శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం విద్యుత్ శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో కరెంటు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించకపోతే ఏఈ కార్యాలయం, ఎస్ఈ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సాయి రెడ్డి, కామారెడ్డి మండల అధ్యక్షుడు చిన్న అంజన్న, పాల్వంచ మండల అధ్యక్షుడు తోట సాయిలు, రామ్ రెడ్డి, నారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాటేపల్లిలో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం కాటేపల్లి గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను తహశీల్దార్ రాజశేఖర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు చేరవేయడంలో స్మార్ట్ రేషన్ కార్డు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ ఉన్నప్పటికీ సంబంధిత రేషన్ దుకాణంలో బియ్యం పొందే అవకాశం ఉందని తెలిపారు. జీపీవో రాములు, నాయకులు మల్లప్ప పటేల్, ఇస్మాయిల్ పటేల్, అశోక్ పటేల్, గంగాగౌడ్, హన్మాండ్లు, శంకర్, రాంచందర్, సాయిలు, రామప్ప, సంగన్న, చందర్, విఠల్, శ్రీను పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో పోలీస్ వ్యవస్థ తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వరుసగా జరుగుతున్న చోరీల కారణంగా ప్రజలు భయాందోళనలో ఉన్నారు. అలాగే గాంధారి పీఎస్‌లో ఇన్‌ఛార్జి పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– అక్షరటుడే, గాంధారి



# ఇన్‌ఛార్జీలతో ఇంకెన్నాళ్లు..?

■ గాంధారిలో పెరుగుతున్న నేరాలు.. ■ 15రోజుల వ్యవధిలో రెండు ఆలయాల్లో చోరీలు ■ పట్టుబడ్డ బియ్యం లారీ సీజింగ్‌లో సమన్వయ లోపం

గాంధారి పోలీస్‌స్టేషన్ పరిధిలో 15రోజుల వ్యవధిలో రెండు ఆలయాల్లో చోరీలు జరిగాయి. దీంతో ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. మండల పరిధిలో 45 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతిరోజు ఏదో ఒక జీపీలో చోరీలు, తగాదాలు జరుగుతూనే ఉంటాయి. అలాగే వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో మండపాల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే నెలరోజులుగా రెగ్యులర్ ఎస్సై సెలవులో ఉండడంతో ఇన్‌ఛార్జీ ఆధ్వర్యంలో స్టేషన్‌లో పాలన సాగుతోంది. దీంతో పాలన గాడి తప్పుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

### స్టేషన్ ఎస్సై లేకపోవడంతో..


గాంధారి పోలీస్‌స్టేషన్‌లో రెగ్యులర్ ఎస్సై లేకపోడంతో పనిభారంతో నిఘా లోపించి, శాంతిభద్రతలు గాడి తప్పుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాబోయే వినాయక చవితి వేడుకల వేళ ముందస్తు జాగ్రత్తలు, గొడవలు జరగకుండా అల్లరి మూకలను బైండోవర్ చేసే చర్యలు కొరవడతాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

### రెండు ఆలయాల్లో దొంగతనాలు..

15 రోజుల వ్యవధిలోనే గాంధారి మండలంలోని మల్లన్న గుడి, బుగ్గగండి లింగేశ్వర ఆలయాల్లో హుండీలను పగలగొట్టి దొంగలు డబ్బులు దోచుకెళ్లారు. రోజులు గడుస్తున్నా నిందితులు ఇప్పటికీ పట్టుబడలేదు. చోరీ సొత్తు రికవరీ కాలేదు. అలాగే నాలుగైదు రోజుల క్రితం రైస్‌మిల్ బియ్యంతో వెళ్తున్న 16 టైర్ల లారీని పట్టుకున్న పోలీసులు, దానిని స్టేషన్‌లో కాకుండా బస్టాండ్ ఆవరణలోనే నిలిపివేశారు. వేబిల్ ఉండి, పర్మిషన్ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ఆపేశామని పోలీసులు వివరణ ఇస్తున్నారు. బియ్యం లారీ పట్టుబడి వారం కావస్తున్నా, తమకు ఎలాంటి సమాచారం లేదని తహశీల్దార్ రేణుక చావన్ తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చామని పోలీసులు చెబుతుంటే, రెవెన్యూ శాఖకు విషయం తెలియకపోవడం పోలీసుల పనితీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది. పండుగల వేళ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, మండలంలో నేరాలను అరికట్టేందుకు తక్షణమే రెగ్యులర్ ఎస్సైని నియమించాలని గాంధారి ప్రజలు కోరుతున్నారు.







## రజకులకు వాషింగ్ మిషన్లు అందజేత

**అక్షరటుడే, కోటగిరి :** కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలంలో మొత్తం 16 మంది లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లను పోతంగల్ సర్పంచ్ సంధ్య (బజరంగ్) అందజేశారు. కేంద్ర ప్రభుత్వం కులవృత్తులను గుర్తించి వారికి విశ్వకర్మ యోజన పథకం ద్వారా సహాయం అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా 16 మంది రజకులకు వాషింగ్ మిషన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి బీజేపీ మండల అధ్యక్షుడు వేముల నవీన్, మామిడి సాయి ప్రసాద్, కట్టు రమేష్, మేత్రి శివరాజ్, పోస్టల్ సిబ్బంది ప్రేమ్ కుమార్, లక్ష్మణ్, ఓమన్నా పటేల్, హన్మాండ్లు, కిరణ్ సేట్, శంకర్ పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలకు జరిమానాలు

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** నగరంలో ప్లాస్టిక్ విక్రయిస్తున్న పలు దుకాణాలపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. మంగళవారం పలు దుకాణాలకు జరిమానాలు విధించిన అధికారులు బుధవారం సైతం సుభాష్‌నగర్ ఏరియాలో పలు దుకాణాలకు రూ.15,000 జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నజీర్ అహ్మద్, ఎస్ఎస్ సాజిద్ అలీ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

## త్రీ ఫేస్ కరెంట్ కోసం రోడ్డెక్కిన అన్నదాతలు



**అక్షరటుడే, కామారెడ్డి:** త్రీఫేస్ కరెంటు సరిగా రాక పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో తీవ్ర ఆవేదనకు గురైన రైతులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజ్ వద్ద కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. 15 రోజులుగా వ్యవసాయ బోరుబావుల వద్ద త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని రైతులు వాపోయారు. రోజుకు ఐదు నుంచి ఆరు గంటలు మాత్రమే కరెంటు వస్తోందని, అది కూడా గంటగంటకు ట్రిప్ అవుతుండటంతో బోర్లు నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వరి, మొక్కజొన్న, సోయా వంటి పంటలకు సరైన సమయంలో నీరు అందక పొలాలు బీటలు వారుతున్నాయని, వేల రూపాయలు అప్పు చేసి పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో ఎండిపోవడం తమను తీవ్రంగా కుంగదీస్తోందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

## ఉషోదయ కళాశాలలో మానవహారం



**అక్షరటుడే, బోధన్:** తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ఉషోదయ కళాశాలలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా కళాశాలలకు బకాయి ఉన్న ట్యూషన్ ఫీజులను చెల్లించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ డిగ్రీ కళాశాల, ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో బుధవారం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం బసవతారకం, ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ క్యాంప్‌లో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన సుమారు 20 మంది వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొని 200 మంది ప్రజలకు వివిధ రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ఏవైనా అనుమానాస్పద లక్షణాలు లేదా ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం అధ్యక్షుడు మొహమ్మద్ రఫీయుద్దీన్, పీడీజీ లయన్ పి.బసవేశ్వర రావు, ఆర్సీ ఘనాసాగర్, మోహన్‌దాస్, సుధీర్ బాబు, సామల లక్ష్మీనారాయణ, అంబాల తిరుపతి, గంగారెడ్డి, గంగాధర్, చిన్న రవికుమార్ పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో ఘనంగా కాళోజీ నారాయణ రావు జయంతి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో బుధవారం పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రసాధనలో కాళోజీ కీలకపాత్రం పోషించారన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని నింపి ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, అధికారులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మాయి మోసం చేసిందని.. యువకుడి ఆత్మహత్య



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని ఓ యువకుడు నిండు ప్రాణాలు తీసుకున్నాడు. చనిపోయే ముందు సెల్ఫీ వీడియో తీసి తన బాధను వెల్లడించాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం మరియా తండాలో చోటు చేసుకుంది. మరియ తండాకు చెందిన బానోత్ విజయ్(22) స్థానికంగా ఓ యువతిని కొన్నాళ్లుగా ప్రేమించాడు. అయితే ఆ యువతి విజయ్‌తో కాకుండా మరొకరితో పెళ్లికి సిద్ధమైందని అని వీడియోలో తెలిపాడు. అమ్మా,నాన్నలు బాగుండాలని తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. అతడి వద్ద ఉన్న మొబైల్‌లోని వీడియో ఆధారంగా ప్రేమించిన యువతి వదిలేసిందనే కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా పోలీసులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారును తప్పించబోయి డీసీఎం బోల్తా..



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ముందు వెళ్తున్న కారును తప్పించే క్రమంలో డీసీఎం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రయాన్‌పల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు పార్సిల్ లోడుతో వెళ్తున్న డీసీఎం ముందున్న కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో డీసీఎం రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, హైవే అంబులెన్స్ సిబ్బంది అతడిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డీసీఎం రోడ్డుపై బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బోల్తాపడిన డీసీఎంను తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

**అక్షరటుడే,నందిపేట్:** మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరుణ్‌కుమార్ కోరారు. నందిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు ' మట్టి గణపతులు పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే అంశంపై అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించడం వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనాలు, పీఓపీతో చేసిన విగ్రహాలతో కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరుణ్ కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, బీట్ ఆఫీసర్ లింబాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

